క్లుప్తంగా

టెన్త్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు

యడ్లపాడు: మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 19 నుంచి 26 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు ఘంటశాల విజయభారతి తెలిపారు. మార్చి 2025 పరీక్షల్లో విఫలమైన విద్యార్థుల కోసం ఈ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్షలు నిర్వహించబడతాయన్నారు. హాల్ టికెట్లను విద్యార్థులు తాము చదివిన హైస్కూల్ హెచ్.ఎం.ల వద్ద నుంచి పొందవచ్చు. ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు రూ.50 ఫెనాల్టీతో చెల్లించి హాల్ టికెట్లు తక్షణమే పొందవచ్చునని సూచించారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఇక 19న తెలుగు, 20న హిందీ, 21న ఇంగ్లిష్, 22న గణితం, 23న ఫిజికల్ సైన్స్, 24న బయాలాజికల్ సైన్స్, 26న సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగుతాయి.

18న కంటి వైద్య శిబిరం

చిలకలూరిపేటటౌన్: మండలంలోని కట్టుబడివారిపాలెంలో ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వచ్ఛ సేవ టీం(కట్టుబడివారిపాలెం, యక్కలవారిపాలెం, మోపూరివారిపాలెం) ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఏర్పాటు చేస్తున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగే ఈ శిబిరంలో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు సేవలందించనున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు కూడా ఉచితంగా నిర్వహించనున్నారు. ఆపరేషన్ సమయంలో భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్, ఆరోగ్యశ్రీ, ఓటర్ కార్డు జిరాక్స్ కాపీలు, అలాగే కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్లు తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. మరిన్ని వివరాలకు సెల్‌నం: 97012 88466, 96667 75004 సంప్రదించాలన్నారు.

19న వైస్ ఎంపీపీ ఎన్నిక

నరసరావుపేట రూరల్: మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి ఈనెల 19వ తేదీ సోమవారం ఎన్నిక నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి శుక్రవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ ఆధ్వర్యంలో ఉదయం 11గంటలకు ఎన్నిక జరుగుతుందని తెలిపారు. మార్చి నెలలో నిర్వహించిన ఎన్నికను వైఎస్సార్‌సీపీ బహిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో వాయిదా పడిన వైస్ ఎంపీపీ ఎన్నికను 19వ తేదీన నిర్వహిస్తున్నారు.

న్యాయవాద సంఘ కార్యవర్గం ఏకగ్రీవం



నరసరావుపేట టౌన్: స్థానిక న్యాయవాద సంఘ కార్యవర్గం 2025–2026 ఏడాదికి సంబంధించి ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. నామినేషన్ సమయం ముగిసేసరికి అధ్యక్షుడిగా న్యాయవాది గన్నె వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా నున్న వెంకట నాగరాజు, కార్యదర్శిగా శ్రీరామనేని ప్రసాదు, జాయింట్ సెక్రటరీ పదవికి గుండా రాజేష్‌కుమార్, కోశాధికారి పదవికి సునీల్ సింగ్‌లు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లను ఎలక్షన్ కమిషన్ ఆమోదించడంతో అన్ని పదవులు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు ఎన్నికల కమిషన్ చైర్మన్ మోరా ప్రతాపరెడ్డి నేతృత్వంలో ఎంపికైన అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, జీవి సుబ్రహ్మణ్యం, కె. విజయ్‌కుమార్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో కొలువైయున్న షిర్డీసాయినాధుని మందిర పదమూడో వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయిబాబాకు విశేషంగా అలంకరించి పూజలు, పంచామృతాభిషేకాలు, గోత్రనామ పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. షిర్డీసాయినాధుని నామస్మరణ మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించండి

బొల్లాపల్లి : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో బంజారా విద్యార్థులకు ఆర్థిక చేయూత అందించారు. మండలంలోని రాజానాయక్ తండాలో ఆ సేవా సంఘం నాయకులు జటావత్ రాంబాబు నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2025వ విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు సుమారు వంద మందికి నగదు పారితోషికం అందజేశారు. బంజారా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొండవీడు యూపీ స్కూల్ అప్‌గ్రేడ్

జడ్పీహైస్కూల్‌గా పదోన్నతి!

- ప్రైమరీ మోడల్ స్కూల్‌గా ఎంపిక
- రెండు ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు
- గ్రామస్తుల సుదీర్ఘ స్వప్నం సాకారం
- ఆనందంలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- స్కూళ్ల పునఃప్రారంభం నుంచే అమలు



కొండవీడు యూపీస్కూల్

యడ్లపాడు: చారిత్రక ప్రాంతంలోని కొండవీడు యూపీ స్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయింది. అంతేకాదు ప్రైమరీ మోడల్ స్కూల్‌గానూ ఎంపిక కావడం విశేషం. వేసవి సెలవుల అనంతరం స్కూళ్ల పునఃప్రారంభం నుండే హైస్కూల్‌గా మార్పుచేసి తరగతులు బోధించాలంటూ ఉత్తర్వులు అందాయి. 1958లో చిన్న ప్రాథమిక పాఠశాలగా ఏర్పడిన ఈ విద్యాలయం, 2015లో ప్రాథమికోన్నత పాఠశాలగా అడుగు వేసింది. అయితే, గత మూడేళ్లుగా ఉపాధ్యాయులు గ్రామ పెద్దల్ని, స్థానిక నేతల్ని కలిసి చివరకు 2025లో తమ సుదీర్ఘ స్వప్నమైన హైస్కూల్‌ను సాధించుకున్నారు.

జగన్ హయాంలోనే...

మనబడి నాడు–నేడు పథకం కింద రూ.25 లక్షలు పాఠశాలకు మంజూరయ్యాయి. పాఠశాల మౌళిక సదుపాయాలు సమకూరాయి. ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో మనబడి నాడు–నేడు తరహాలో కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధికి పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకానికి శ్రీకారం చుట్టింది. 2024లో ఈ పాఠశాల పథకం కింద ఎంపికైంది. ఫలితంగా కేంద్రం నుంచి రూ.4 కోట్ల నిధులు నేరుగా మంజూరవడం, సాధారణ పాఠశాల స్థాయి నుంచి కార్పొరేట్ స్కూల్‌గా దిశగా ప్రగతి సాధిస్తుంది. ఈ నిధులతో డిజిటల్ తరగతుల గదులు, సాంకేతిక ల్యాబ్‌లు, ఆట స్థలాలు, మల్టీమీడియా క్లాస్‌లు, ఫర్నిచర్, మరింత హైజీనిక్ వాతావరణం వంటి సదుపాయాలు దశల వారీగా ఏర్పాటు అవుతున్నాయి. 2020, 2023లో రెండుసార్లు జిల్లాస్థాయిలో, అదే ఏడాది రాష్ట్రస్థాయిలోనూ 'స్వచ్ఛ విద్యాలయ' పురస్కారాన్ని సాధించింది.

అదనంగా ఉపాధ్యాయుల రాక...

పాఠశాల హైస్కూల్‌గా మారడంతో ఉపాధ్యాయుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. గతంలో కేవలం ఎనిమిది మంది మాత్రమే ఉండగా, ప్రస్తుతం ప్రైమరీకి 5గురు, హైస్కూల్‌కు 9 మంది మొత్తం 14 మంది ఉపాధ్యాయులు బోధించనున్నారు. అంతేకాదు, పీఎంశ్రీ పథకం కింద కంప్యూటర్, వొకేషనల్ కోర్సులకు అదనంగా మరో రెండు ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు కావడం విశేషం. ప్రైమరీ మోడల్‌స్కూల్‌లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు, హెచ్‌ఎం, ఉంటారు.

పాఠశాలలో అన్ని ప్రత్యేకమే

పాఠశాలకు కోట, కొండవీడు, కొత్తపాలెం(పుట్టకోట) గ్రామాల నుంచి గతేడాది 210 మంది విద్యార్థులు వస్తున్నారు. ఇక్కడి ఉపాధ్యాయులు సమన్వయంతో వీరికి చదువుతో పాటు అబాకస్, హ్యాండ్ రైటింగ్, డిబేట్, డ్రాయింగ్, స్పోర్ట్స్, కల్చరల్, స్కాట్ ఏర్పాటు కాగా, త్వరలో ఎన్‌సీసీ కూడా రానుంది. కార్యకలాపాల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో జాతీయ, అంతర్జాతీయస్థాయిలోనూ ప్రతిభ కనబర్చారు.

సమష్టి సహకారం మరువలేను



ఒక చిన్న పాఠశాల హైస్కూల్‌గా ఎదగాలంటే ప్రభుత్వ ఉత్తర్వులు కావాలి. కానీ ఆ ఉత్తర్వుల వెనుక ఉపాధ్యాయుల నిస్వార్థ సేవ, గ్రామస్తుల ఆకాంక్ష, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం, గ్రామ పెద్దల చొరవ ఉంటేనే అదిసాధ్యం. ప్రత్యక్ష, పరోక్షంగా అండగా నిలిచిన అందరికీ నా కృతజ్ఞతలు. తల్లిదండ్రులు ఈ ఏడాది నుండే ఇక్కడ ప్రైమరీ మోడల్ స్కూల్లోనూ, హైస్కూల్‌లో చేర్పించండి.

–జి శ్రీనివాసరావు, హెచ్‌ఎం కొండవీడు హైస్కూల్

వైభవంగా అమ్మవారి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఈపూరు(శావల్యాపురం): ఈపూరు మండలంలోని కొచ్చర్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీఅంకాళ్ళ పరమేశ్వరి అమ్మవారి తిరునాళ్ల వేడుకలు గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి సన్నిధిలో మహిళలు పొంగళ్ళు పొంగించి పసుపు–కుంకుమ నూతన వస్త్రాలు అందజేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గంలో ప్రసిద్ధి కాంచిన విశిష్టత కల్గిన అమ్మవారిని దర్శించుకునేందుకు ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు బారులు తీరారు. గత నాలుగు రోజుల నుంచి గ్రామ పురవీధుల్లో సిడిమానురు ఉత్సవాలు ఘనంగా నిర్వహించగా చివరిరోజు ఉదయం 10 గంటలకు ముగిసిన తదుపరి తిరునాళ్ల వేడుకలు జరుపుకోవటం గత కొన్ని సంవత్సరాలు ఆనవాయితీగా వస్తుంది. భక్తులు కోర్కెలు తీర్చే అమ్మవారిని కొచ్చర్లతండా, కొచ్చర్ల, కొండ్రముట్ల, దుశ్యాన్‌పేట, సత్యనారాయణపురం, శ్రీనగర్, కొండ్రముట్లపాలెం,అంగలూరు తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తిరునాళ్ల వేడుకలు సందర్భంగా అమ్మవారి ప్రాంగణంలో భారీ అన్నదానం కాకుమాను సుబ్రమణ్యం, యాదవ సంఘం నేతలు నిర్వహించారు. ఆరు విద్యుత్ ప్రభలు పాట కచ్చేరి సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ గ్రామాలకు చెందిన ఏర్పాటు చేశారు. దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకరరావు సారథ్యంలో ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు 200 మంది పోలీసు సిబ్బందితో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా భక్తులకు అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు పాటించారు.

ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రచారం

ఎయిడ్స్‌పై కళాజాత బృందం వీధి నాటకం



మార్కెట్‌సెంటర్‌లో కళాజాత బృంద సభ్యులు ప్రదర్శిస్తున్న వీటి నాటకం

నరసరావుపేట: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ కళాజాత బృందాల ద్వారా ప్రజల్లో అవగాహన కోసం ప్రచారం ప్రారంభించింది. గురువారం హాండ్స్ ఆఫ్ కంఫాషన్ ఆధ్వర్యంలో గాయత్రి కల్చరల్ సొసైటీ నాగరాజు కళాజాత బృందం స్థానిక మార్కెట్ సెంటర్‌లో వీధి నాటకాలను ప్రదర్శించారు. వీటి ద్వారా ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, ఆ వ్యాధి రాకుండా ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి, క్షయ వ్యాధి సంబంధం, వ్యాధి ఉన్న గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పాటల రూపంలో వివరించారు. అలాగే సుఖవ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగం, హెచ్‌ఐవీ చట్టం–2017 గురించి ప్రజలకు అవగాహనా కల్పించారు. హెచ్‌ఐవీ పరీక్ష అన్నీ ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా చేస్తారని, వ్యాధి ఉన్నవారు ఏఆర్‌టి కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని, అంతేకాకుండా క్రమం తప్పకుండా సీడీ4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని తెలియచెప్పారు. హాండ్స్ ఆఫ్ కంఫాషన్ ప్రీవెన్షన్ యూనిట్ ఎన్జీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్, ఐసీటీసీ కౌన్సిలర్స్ రవి, రజని, వాసవి, మీరా, మేరీ, శివరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

యార్డ్ కమిటీ నియమిస్తూ జీవో

నరసరావుపేట రూరల్: నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా పూనాటి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా కాసా ఆంజనేయులుతో పాటు 14 మందిని నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరితో పాటు లింగంగుంట్ల సొసైటి ఇన్‌చార్జ్, వ్యవసాయ ఏడీఏ, మున్సిపాలిటి ప్రత్యేక అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

వినుకొండ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ వాటర్ సెక్షన్, కరెంటు సెక్షన్ ఆఫీస్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలోని వర్కర్స్‌తో ఆయన గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బూదాల మాట్లాడుతూ వర్కర్స్ చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి రాగానే మున్సిపాలిటీలో పనిచేస్తున్నటువంటి అన్ని కార్మిక శాఖలకు వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండ్రముట్ల సుభాని, కొప్పరపు మల్లికార్జున, పచ్చిగొర్ల ఏసు, మస్తాన్, గాలెయ్య, శ్రీను, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ సెట్ ఫలితాల్లో బోయపాలెం విద్యార్థినికి ర్యాంకు



యడ్లపాడు: గురువారం విడుదలైన ఏపీ ఈ సెట్ ఫలితాల్లో పల్నాడుజిల్లా యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామం విద్యార్థిని దొరడ్ల సత్య వెంకటనాగలక్ష్మీ ప్రణతి అపూర్వమైన విజయాన్ని సాధించింది. బ్రాంచ్ స్థాయిలో 237వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో 292వ ర్యాంక్ సాధించిన ప్రణతి ఇప్పుడు గ్రామం మొత్తానికి గర్వకారణంగా నిలిచింది. గ్రామానికి చెందిన దొరడ్ల మల్లికార్జునరావు, సౌజన్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా, రెండో సంతానమైన ప్రణతి పుల్లడిగుంటలోని మల్నేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా కోర్సు పూర్తి చేసింది. ఈ సెట్ ద్వారా ద్వితీయ సంవత్సరం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశానికి అర్హత సాధించింది. ర్యాంక్ సాధించిన ప్రణతి కృషికి పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పాలిసెట్‌లో..



నూజెండ్ల: మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన తాటిపర్తి స్నేహలతారెడ్డి 2025 ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో 237వర్యాంక్ సాధించింది. గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి ది వ్యవసాయ కుటుంబం గ్రామీణ విద్యార్థిని స్టేట్‌ర్యాంక్ సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.

రేషన్ సమస్యలు పరిష్కరించాలి

సాక్షి ఎఫెక్ట్

నాదెండ్ల: నూతన రేషన్‌కార్డుల జారీ, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల చేరికలు, తొలగింపులు, చిరునామా మార్పులు, సవరణలపై ఈ నెల 6వ తేదీ నుంచి మండలంలోని అన్ని సచివాలయాల్లో ప్రక్రియ కొనసాగుతున్న సంగతి విదితమే. మేజర్ పంచాయతీ గణపవరం, పసుమర్రు గ్రామాల్లో ప్రక్రియ నేటికీ ప్రారంభం కాకపోవటంపై సాక్షి దినపత్రికలో గురువారం 'రేషన్‌కార్డుల దరఖాస్తులకు సాంకేతిక సమస్యలు' అంటూ కథనం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు సిబ్బందితో కలిసి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి సమస్యను వివరించారు. దీంతో స్పందించిన ఆయన రాష్ట్ర సచివాలయ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. రెండు గ్రామాల్లో సమస్య పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రెండు గ్రామాలను చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే స్థానికులు హైకోర్టును ఆశ్రయించటంపై విలీన ప్రక్రియపై స్టే విధించారు. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయాల వెబ్‌సైట్‌లలో మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన సేవలపై సమస్యలు తలెత్తుతున్నాయి.

రేషన్ బియ్యం బదులు నగదు ఇస్తే చర్యలు

నాదెండ్ల: పేదల కడుపునింపే రేషన్‌బియ్యం పెద్దల జేబులు నింపే సరుకుగా మారిందంటూ ''పేట్రేగుతున్న రేషన్‌మాఫియా'' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవిన్యూ అధికారులు స్పందించారు. గురువారం తహసీల్దార్ ఏవీ రమణ గణపవరం గ్రామాన్ని సందర్శించారు. వీఆర్వోలతో సమావేశమై గ్రామంలో రేషన్‌బియ్యానికి బదులు నగదు ఇస్తున్నారని వచ్చిన వార్తలపై విచారణ చేశారు. రేషన్ డీలర్ల వద్ద నుంచి లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుండి 17వ తేదీ వరకూ ఎండీఎం వాహనాల ద్వారా కార్డుదారులకు తప్పనిసరిగా రేషన్‌బియ్యంతో పాటూ పంచదార పంపిణీ చేయాలని ఆదేశించారు.

సేవా భూషణ్ అవార్డు గ్రహీత పాలేష్‌కు సన్మానం

వినుకొండ: సేవా భూషణ్ అవార్డు పొందిన దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు పెద్దేటి పాలేష్‌ను పట్టణంలో పుర ప్రముఖులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గత కొన్ని సంవత్సరాలుగా దళిత గిరిజన వర్గాలకు పాలేష్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, నక్కా నాగిరెడ్డి, ఎంపీటీసీ జక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సచివాలయం కన్వీనర్ పి.అవినాష్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కట్టెంపూడి పిచ్చయ్య, ఎంపీటీసీ దూపాటి గాలెయ్య, కట్టెంపూడి చెన్నయ్య, కొమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వాక నాగిరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

శావల్యాపురం: పూర్వ విద్యార్థులు సహకారం అభినందనీయమని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. గురువారం 1999–2000 విద్యా సంవత్సరంలో శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయంగా రూ.30వేలు ఆర్థిక చేయూత అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందంచటం పలువురుకు ఆదర్శమన్నారు. పాఠశాల అభ్యున్నతికి రూ.20వేలు క్రీడా సామగ్రి వితరణ రూ.7వేలు ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మికి అందజేశారు. రూ.3.500 రూపాయాల విలువ చేయు బ్యాట్‌ను రావినూతల రత్నకీర్తన అందజేశారు. పాఠశాల స్థల దాతలు పద్మనాభుని హనుమంతరావు, గట్టుపల్లి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, రికార్డు అసిస్టెంట్ శ్రీకాంత్, పూర్వ విద్యార్థుల ప్రతినిధులు రెడ్డి వెంకట కిరణ్ కుమార్, ఏలికా శ్రీనివాసరావు, పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

పోస్ట్ వ్యాక్సినేషన్ సీరం నమూనాల సేకరణ



గోవు నుంచి రక్త నమూనా సేకరిస్తున్న పశువైద్య అధికారులు, సిబ్బంది

రొంపిచర్ల: పశువుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షించటం ద్వారా క్షేత్రస్థాయిలో టీకాల నిర్వహణ అవసరాన్ని నిర్ధారించవచ్చు అని వెటర్నరీ బయోలాజికల్ రిసెర్చ్ ఇనిస్టూట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి. సనేలీ కుమారి అన్నారు. మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో నిర్వహించిన పోస్ట్ వ్యాక్సినేషన్ సీరం నమూనాల సేకరణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో టీకాల నిర్వహణ కార్యక్రమాన్ని పర్యవేక్షించటానికి ప్రతి జిల్లా నుంచి యాదృచ్ఛికంగా కొన్ని గ్రామాలను ఎంపిక చేయటం జరిగిందన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పశువుల నుంచి రక్తనమూనాలను సేకరించి ల్యాబ్‌లో పరీక్షలు చేసి క్షేత్రస్థాయిలో టీకాల నిర్వహణ అవసరాన్ని నిర్ధారిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. కళావతి, మండల పశు వైద్యాధికారి డాక్టర్ డి. వంశీప్రసాద్, వీఏ కె. లింగమ్మ, ఏహెచ్‌ఏలు జి. బాలి, కె. వీరబ్రహ్మం, షేక్ హమ్మద్ బాషా, గోపాలమిత్ర దొండేటి కృష్ణారెడ్డి, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



పదవీ విరమణ చేసిన హోంగార్డుకు చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ సంతోష్

నరసరావుపేట: ఉద్యోగంలో ఉన్నపుడు చేసిన మంచి సేవలే ఉద్యోగ అనంతరం కూడా ఆ వ్యక్తి గుర్తుండేలా చేస్తాయని జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పేర్కొన్నారు. పోలీసు శాఖలో గత 32ఏళ్లుగా హోంగార్డుగా విశేష సేవలు అందజేసి గురువారంతో పదవీ విరమణ పొందిన వీవై స్వామిని జిల్లా పోలీ సు కార్యాలయంలో శాలువ, పూలదండలు వేసి సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలీసులు ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. ప్రజలకు అత్యంత దగ్గరగా ఉంటూ వారి సాధకబాధకాల్లో మమేకమై సేవలందించే అవకాశం పోలీసుశాఖలోనే అధికంగా ఉంటుందన్నారు. పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకుందని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ 32 ఏళ్లపాటు సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు హోంగార్డును అభినందించారు. హోంగార్డుల సేవలను పోలీసుశాఖ గుర్తుంచుకుంటుందని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద మంజూరైన రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, ఇకపై కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో ఏ సహాయం కావాలన్నా పోలీస్ శాఖ ఎల్లవేళలా వారికి తోడుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హోంగార్డు ఆర్‌ఐ కృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించండి

57వ రోజుకు చేరిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు నియంతృత్వ పోకడలు వీడి కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరిన 36 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకుని రూ.21 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 57వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సాల్మన్ మాట్లాడుతూ కార్మికుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆప్కాస్ ఉన్నప్పటికీ ఔట్ సోర్సింగ్ కార్మికుల మంటూ నెలలో 30 రోజులు పనిచేసినా 10 నుంచి 15 రోజులకు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారన్నారు. అయినప్పటికీ ఆరేళ్ల విధులు నిర్వహించామని, చివరికి విసిగి వేశారి తప్పని పరిస్థితుల్లో నిరవధిక సమ్మెకు పూనుకున్నామన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఇంచార్జ్ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం తమ స్థానంలో బయటి వ్యక్తులకు రోజుకు రూ.700 చెల్లించి పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారని, అవే వేతనాలు తమకు ఇవ్వండని అడుగుతుంటే వివక్ష ఎందుకన్నారు. పట్టణంలో అన్నీ వీధులను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నా కష్టాన్ని గుర్తించకుండా నియంతృత్వ ధోరణి అవలంబించడం దారుణమన్నారు. పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలను తెలియజేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకుని సమాన పనికి సమాన వేతనం వారాంతపు, పండగలు, ఇతర ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయ బదిలీలలో ప్రభుత్వ వైఖరి సరికాదు

ఎస్టీయూ స్టేట్ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు, సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు



మాట్లాడుతున్న పోటు శ్రీనివాసరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయ బదిలీల్లో ప్రభుత్వ వైఖరి మారాల్సిన అవసరం ఉందని ఎస్టీయూ స్టేట్ డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు, సంఘ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు చెప్పారు. పట్టణంలోని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో గురువారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై ఉపాధ్యాయ సంఘాలు కోరిన అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలలకు పంపడం తిరోగమన చర్య అవుతుందని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలల్లో డీఎడ్ పూర్తి చేసిన వారిని కొనసాగించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఉల్లంఘించటం సరికాదన్నారు. స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు పంపకుండా ఎస్‌జీటీలకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారిన వెబ్ కౌన్సెలింగ్‌లో ఇబ్బందులు సరిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వి.జయప్రకాశ్, మగ్బూల్‌బాష, దుర్గా ప్రసాద్, జి.కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, బొంతా రవి, షేక్ మస్తాన్‌వలి, సీహెచ్ మల్లేశ్వరరావు, జిల్లా మహిళా కన్వీనర్ ఎం.శారద పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు



వివరాలు తెలుపుతున్న విద్యుత్ శాఖ అధికారులు

చిలకలూరిపేట: విద్యుత్ అధికారులు అనధికార విద్యుత్ వినియోగం నియంత్రణలో భాగంగా గురువారం విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. సీఆర్‌డీఏ సర్కిల్ విద్యుత్ ఎస్ఈ పి సుబ్రమణ్యం, గుంటూరు టౌన్ -2 ఈఈ వై ఏడుకొండలు, విజిలెన్స్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండల పరిధిలోని 19 గ్రామాలలో 44 బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అనధికారికంగా అధిక విద్యుత్ లోడు వినియోగించుకుంటున్న 150 సర్వీసులను గుర్తించి రూ. 6 లక్షలు, అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తున్న నాలుగు సర్వీసులు గుర్తించి రూ. 1.20 లక్షలు, విద్యుత్ కనెక్షన్ బిల్లింగ్ తేడా ఉన్న ఒక సర్వీసుకు రూ. 30వేలు అపరాధ రుసుము విధించారు. విద్యుత్ చౌర్యం అనేది సామాజిక నేరం కింద పరిగణించబడుతుందని, దానికి జైలు శిక్ష కూడా ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. తరుచుగా దాడులు నిర్వహించి,కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. విద్యుత్ డీఈఈలు ఏ గురునాధరావు, ఎన్ మల్లికార్జునరావు, కె.రవికుమార్, ఆర్.అశోక్‌కుమార్, 11 మంది ఏఈఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.